పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు

ఏర్గట్ల తెలుగు పండిట్ ప్రవీణ్‌శర్మకు పుస్తకాలు అందజేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

ఏర్గట్ల, సెప్టెంబర్ 29: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలచెలిమి గ్రంథలయం ఏర్పాటులో భాగంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ తనకు పుస్తకాలు అందజేసినట్లు పాఠశాల తెలుగు పండిట్ ప్రవీణ్‌శర్మ ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తనకు పుస్తకాలు అందజేశారని తెలిపారు. చిల్డ్రన్ అకాడమీ, బాల చెలిమి ఆధ్వర్యంలో గ్రంథాలయానికి మరిన్ని పుస్తకాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న కొండ లక్ష్మణ్ బాపూజీ కమిటీ

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 29 :నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన చిలుక గంగాదాస్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. నిజామాబాద్ నగర కొండ లక్ష్మణ్ బాపూజీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పెంట దత్తాద్రి, ఎస్ఆర్ సత్యపాల్, బూస రవి, బొట్టు వెంకటేశ్, సురేందర్ స్వామి, గంగరాజు, ధరంవీర్, భాస్కర్ పాల్గొన్నారు.

అడవిలో మతిస్థిమితం లేని వ్యక్తి గుర్తింపు

అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తున్న గ్రామస్తులు

సిరికొండ, సెప్టెంబర్ 29 :మండలంలోని తాటిపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో మతిస్థిమితం లేని వ్యక్తిని పశువుల కాపరులు ఆదివారం గుర్తించారు. పోలీసులు, అటవీశాఖ సిబ్బందికి సమాచారమందించారు. అధికారులు స్థానికుల సహకారంతో తాటిపల్లి గ్రామానికి తీసుకువచ్చి, 108 అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలించారు. ముస్లిం మతానికి చెందిన వ్యక్తిగా అధికారులు భావిస్తున్నారు.

సీఎస్ఐలో సీనియర్ సిటిజన్స్ సండే



సీఎస్ఐ చర్చిలో సన్మానం పొందిన సీనియర్ సిటిజన్లు

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 29: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు సీనియర్ సిటిజన్లను సన్మానించారు. అనంతరం చర్చి ఫాదర్ రెవరెండ్ ముల్కల ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రతి కుటుంబంలోని సభ్యులు తమ తల్లిదండ్రులను ప్రేమించాలని, వారిని ఆదరించాలని అన్నారు. వారికి సపర్యలు చేసి దేవుని కృప పొందాలని అన్నారు. ఏటా నిర్వహించే సీనియర్ సిటిజన్స్ సండే సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్లను సన్మానించి, దేవుని సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవరెండ్ ముల్కల ప్రభాకర్, రెవరెండ్ స్టీఫెన్, చర్చి ప్రతినిధులు ఉన్నారు.

ఘనంగా వృద్ధుల ఆదివారం

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 29 : మండలంలోని బర్ధిపూర్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో వృద్ధుల ఆదివారం కార్యక్రమాన్ని సంఘ కాపరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏండ్లు పైబడిన వృద్ధులను సన్మానించి, వారి జీవిత అనుభవాలు, జ్ఞానం తదితర వాటి గురించి వివరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాన్సన్, పద్మారావు, ప్రభాకర్, మహేందర్, సురేందర్, జాన్‌బాబు, భూమన్న, ఇందిర, శిరీష, జ్యోత్స్న పాల్గొన్నారు.

కుల రహిత సమాజం కోసం పోరాడుదాం



జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మాక్లూర్, సెప్టెంబర్ 29: మహాత్మా జ్యోతిబా పూలే సత్యశోధక్ సమాజ్ సంస్థను స్థాపించిన సందర్భంగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బోర్గాం(కె)లో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 30 వరకు కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమాలు గ్రామగ్రామాన నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణగౌడ్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా డివిజన్ ప్రధాన కార్యదర్శి దేశెట్టి రాధా, నాయకులు పాల్గొన్నారు.

జోరుగా కల్తీ కల్లు విక్రయాలు

ఇటీవల కల్లు సీసాలో నాచు?

కల్లు సీసాలో నాచు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్29: పట్టణంతో పాటు మండలంలో కల్తీ కల్లు విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు కల్లు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా వివిధ రకాల మత్తు పదార్థాలను కలుపుతూ కృత్రిమ కల్లును తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ప్రజలు అంటున్నారు. ఎక్సైజ్ అధికారులు తూతూమంత్రంగా దాడులు చేస్తున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్మూర్‌లోని ఓ కల్లు దుకాణంలో కొనుగోలు చేసిన సీసాలో ఇటీవల నాచు వచ్చిందంటూ వాట్సప్ గ్రూపుల్లో నాలుగు ఐదు రోజులుగా ఫొటో చక్కర్లు కొడుతోంది. ఎక్సైజ్ అధికారులు స్పందించి దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నవీపేటలో గ్రామ దేవతులకు ప్రత్యేక పూజలు చేస్తున్న పోతరాజులు

ఊరపండుగలో పాల్గొన్న మల్లాపూర్ గ్రామస్తులు

ఘనంగా ఊర పండుగ

ధర్పల్లి/ ఇందల్వాయి/ నవీపేట, సెప్టెంబర్ 29 : జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం ఊరపండుగలను వీడీసీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ధర్పల్లి మండలంలోని ప్రాజెక్టు రామడుగులో గ్రామదేవతల విగ్రహాలను నూతనంగా తయారుచేసి, డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విగ్రహమూర్తులను ఊరేగించారు. గ్రామ పొలిమేరల్లోని గ్రామదేవతల ఆలయాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలంలోని గన్నారం, నల్లవెల్లి, మల్లాపూర్ గ్రామాల్లో ఊరపండగను నిర్వహించారు. గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేశారు. మాజీ సర్పంచులు నోముల విజయలక్ష్మారెడ్డి, లోలం సత్యనారాయణ, కుంట మోహన్‌రెడ్డితో పాటు ఎంపీటీసీలు, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవీపేట మండలకేంద్రంతోపాటు రాంపూర్ గ్రామంలో ఊరపండుగను నిర్వహించారు. మూడేండ్లకు ఒకసారి వీడీసీల ఆధ్వర్యంలో పండుగ నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. నాలుగు రోజుల ముందే గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ముడుపులు, బండారు వేశారు. ఆదివారం గ్రామదేవతల విగ్రహాలకు యాటలను బలి ఇచ్చి, పూజలు చేశారు. కార్యక్రమంలో నవీపేట, దర్యాపూర్, తాడ్‌గామ, రాంపూర్ వీడీసీ సభ్యులు మోస్రా సాయారెడ్డి, భగవాన్, తెడ్డు పోశెట్టి, డాంగే శ్రీనివాస్, సూరిబాబు, రాజరెడ్డి, ఇయం గంగాధర్, లోకం నర్సయ్య, గోపాల్, దేవరాజ్, శ్రీకాంత్, గంగాధర్, రమేశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ, బోనాల పండుగలు

ఎడపల్లి/ బోధన్ రూరల్, సెప్టెంబర్ 29: ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్‌లో పోచమ్మ పండుగను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి దేవతామూర్తులకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా దసరా ముందు ఈ పండుగ నిర్వహిస్తామని వీడీసీ సభ్యులు తెలిపారు. బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను తీసి, డప్పు వాయిద్యాల నడుమ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు.

దర్యాపూర్‌లో...

లంగ్డాపూర్‌లో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు పడకల్ విద్యార్థి

జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 29 : మండలంలోని పడకల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి గోసంగి రిత్విక్ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. జమ్ము కశ్మీర్‌లోని గాంధీనగర్‌లో అక్టోబర్ 1 నుంచి 5 వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆర్మూర్ మినీస్టేడియంలో ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి, జాతీయస్థాయి పోటీలకు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి శ్యాంసుందర్, జిల్లా అధ్యక్షుడు రవిగౌడ్, కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పడకల్ వీడీసీ సభ్యులు రిత్విక్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు కోటగిరి మైనార్టీ కళాశాల విద్యార్థులు..

కోటగిరి, సెప్టెంబర్ 29 : కోటగిరి మండలకేంద్రంలోని మైనార్టీ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు అథ్లెటిక్ విభాగంలో ప్రతిభ చూపారు. జిల్లా కేంద్రంలోని నాగారం స్టేడియంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి వడిత్య శ్రీహరి ప్రథమస్థానంలో, ప్రథమ సంవత్సరం విద్యార్థి అయాన్ ద్వితీయ స్థానంలో నిలిచాడని తెలిపారు. అక్టోబర్ 7,8 తేదీల్లో వరంగల్ జిల్లా హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన కోటగిరి మైనార్టీ కాలేజీ విద్యార్థులు

రెజ్లింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన రుద్రూర్ విద్యార్థినులు

రుద్రూర్, సెప్టెంబర్ 29 : జిల్లాస్థాయి రెజ్లింగ్‌పోటీల్లో రుద్రూర్ ప్రభుత్వ బాలుర ఉన్నత విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించినట్లు సీఆర్పీ అంబర్‌సింగ్ తెలిపారు. ఈనెల 28న మంచిప్పలో జరిగిన జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 9వతరగతి విద్యార్థులు ఎస్.విజయ, జి.సువేణి గోల్డ్‌మెడల్ సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను ఎంఈవో కట్ట శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సీఆర్పీ అంబర్‌సింగ్ అభినందించారు. ఎస్.విజయ తండ్రి అంబర్‌సింగ్ అదే పాఠశాలలో సీఆర్పీగా విధులు నిర్వర్తించడం విశేషం.

జిల్లాస్థాయి రెజ్లింగ్‌పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన విజయ, సువేణి

రాష్ట్రస్థాయి సైన్స్ మేళాకు 'విజయ్' విద్యార్థిని

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 29 : 28వ జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా మాణిక్‌భవన్ పాఠశాలలో ఈనెల 28న నిర్వహించిన సైన్స్ మేళాలో నగరంలోని విజయ్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపింది. పదోతరగతి విద్యార్థిని సీహెచ్. హన్సిక 'అడాలిసెన్స్ అవేర్‌నెస్' అంశంపై పోస్టర్ తయారుచేసి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. విద్యార్థినిని పాఠశాల వ్యవస్థాపకురాలు అమృతలత ఆదివారం అభినందించారు.

జిల్లా స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడిగా గంజ్ సాయన్న ఎన్నిక

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 29 : భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లాకేంద్రంలోని పతంజలి కార్యాలయంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర సోషల్‌మీడియా అధ్యక్షుడు డా.విశ్వనాథ్ మహాజన్ ఒక ప్రకటనలలో తెలిపారు. అధ్యక్షుడిగా గంజ్ సాయన్న, పతంజలి యోగ సమితి అధ్యక్షుడిగా టి.బుచ్చన్న, కిసాన్ సేవా సమితి అధ్యక్షుడిగా లింబాద్రి, యువ భారత్ అధ్యక్షుడిగా రంజిత్, ప్రధానకార్యదర్శిగా ఎం.విజయ్‌కుమార్ ఆర్యా, ఆర్గనైజర్ సెక్రటరీగా జె.కిషన్, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు.

వైద్యశిబిరాలు

ట్రాఫిక్ సిబ్బందికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

కోటగిరిలో మందులు అందజేస్తున్న వైద్యులు

కోటగిరి/ వినాయక్‌నగర్/ సిరికొండ, సెప్టెంబర్ 29 : కోటగిరి మండలకేంద్రంలోని పోచారం కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్, తేళ్ల యువసేన ఆధ్వర్యంలో కంటి, దంత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తేళ్ల రవికుమార్, ప్రధానకార్యదర్శి హన్మంతరావు, కప్ప సంతోష్, మాజీ సర్పంచ్ స్వరూప, సాయిరెడ్డి, ఆనంద్, హైమద్, సలీం పాల్గొన్నారు.

నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బందికి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గుండె వైద్యనిపుణులు డాక్టర్ సందీప్‌రావు, ఛాతి వైద్యనిపుణుడు రాజేంద్రప్రసాద్ పోలీసు సిబ్బందికి పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణతోపాటు రోటరీ క్లబ్ అధ్యక్షుడు విజయరావు, కార్యదర్శి గంగారెడ్డి, గురుప్రీత్ సింగ్, పవన్ పాండే, జితేంద్రమలానీ, రాజ్‌కుమార్ సుబేదార్, సతీశ్ షా, బాబూరావు, పార్సి రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని నగరంలోని బురుడుగల్లీలో ఉన్న మేదరి సంఘం వద్ద బీజేపీ ఖిల్లా రామ్‌మందిర్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. శిబిరాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు.

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మండలంలోని తూంపల్లి గ్రామంలో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఎస్సై బాల్‌సింగ్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతిభ దవాఖాన, గిరిజ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో తూంపల్లి, వర్జన్‌నాయక్ తండా, గోప్యానాయక్ తండా, కొండాపూర్, గడ్కోల్, ముషీర్‌నగర్ ప్రాంతాలకు చెందిన 224 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు ఫౌండేషన్ చైర్మన్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ లక్ష్మణ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ లింగం, మోహన్, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్, రాజేందర్, వినోద్, రాజు, నవీన్, రవి, ప్రశాంత్, బాలరాజు, జీవన్, బాలరాజు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి

కోటగిరి విండో సమావేశంలో పాల్గొన్న అధ్యక్షులు, సభ్యులు

హున్సాలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మందర్న రవి

బోధన్/బోధన్ రూరల్/కోటగిరి/ ముప్కాల్, సెప్టెంబర్ 29: రాష్ట్రప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి నిబంధనలూ లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని విండో పాలకవర్గం తీర్మానించింది. కోటగిరి, ఎత్తొండలో సహకార సంఘాల్లో మహాజన సభలను ఆదివారం నిర్వహించి, పలు అంశాలపై తీర్మానం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో కోటగిరి విండో చైర్మన్ కూచి సిద్ధు, వైస్ చైర్మన్ బొట్టే గజేందర్, డైరెక్టర్లు సాయిరెడ్డి, వీరేశం, శ్రీనివాస్, బీర్కూర్ గంగాధర్, హాగీరావు పటేల్, మోహన్‌రావు, కప్ప రాజయ్య పాల్గొన్నారు.

హున్సా మహాజనసభలో తీర్మానం

మిగిలిన రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని హున్సా మహాజనసభలో తీర్మానం చేశారు. సాలూర మండలంలోని హున్సా గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విండో మహాజనసభను ఆదివారం సొసైటీ చైర్మన్ మందర్న రవి అధ్యక్షతన నిర్వహించారు. పలు తీర్మానాలు చేశారు. రైతుల చెరుకుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని తీర్మానం చేశారు. విండో వైస్ చైర్మన్ వినోద్‌రావు, సొసైటీ కార్యదర్శి హనుమంతురావు, డైరెక్టర్లు ఉన్నారు.

దొడ్డు ధాన్యానికీ రూ.500 బోనస్ చెల్లించాలి

రాష్ట్రంలో అక్టోబర్ ఒకటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, బి.దేవారాం, రాష్ట్ర కార్యదర్శి పడాల శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దొడ్డు ధాన్యం రకం ధాన్యానికీ రూ. 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. ముప్కాల్ మండలం రెంజర్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. వివిధ రకాల అంశాలపై చర్చించి అమోదించి తీర్మానించినట్లు చైర్మన్ తెలిపారు. రైతులకు ప్రభుత్వం ఎలాంటి షరతులూ లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మన్ ముస్కు సంతోష్ రెడ్డి, డైరెక్టర్లు మేడిపల్లి ముత్తెన్న, సామ రాజేందర్, బుయ్య రాజన్న, క్యాతం గంగారెడ్డి,సోసైటీ సిబ్బంది, క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు

భవనం లోపలి నుంచి బయటికి వస్తున్న మురికినీరు

రెంజల్, సెప్టెంబర్ 29: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల భవనం నుంచి మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. డ్రైనేజీ నీరు వెళ్లేందుకు కాలువ లేదు. ఈ మురుగు నీరు రోడ్డుపై నిలిచి దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పోలీస్‌స్టేషన్‌ను ఆనుకొని ఉన్న వ్యవసాయ సహకార సంఘం గోదాం వైపు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రూ.కోట్లు మంజూరు చేసినా అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పూర్తి స్థాయిలో పనులు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనం పక్కనే నిలిచిన మురికి నీటి కారణంగా దోమలు, పందుల బెడద ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపై నిలవకుకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం

నందిపేట్, సెప్టెంబర్ 29: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంర్లు స్థానిక ఎన్పీడీసీఎల్ కార్యాలయం, ఫుడ్‌పార్క్ పరిశ్రమ, పలుగుట్ట, కేదారేశ్వర ఆశ్రమం వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞను చేశారు. శ్రమదానం నిర్వహించి ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రాజ్‌కుమార్, హెచ్‌వోడీలు, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ లక్ష్మణ్ శాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెత్తను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ముగిసిన అంతర్ పాఠశాలల క్రీడలు

- ఓవరాల్ చాంపియన్ చౌట్‌పల్లి

చౌట్‌పల్లి జట్టుకు బహుమతులను అందజేస్తున్న అధికారులు

మోర్తాడ్, సెప్టెంబర్ 29: కమ్మర్‌పల్లి మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఇందులో ఓవరాల్ చాంపియన్‌గా చౌట్‌పల్లి ఉన్నత పాఠశాల నిలిచింది. ఈపోటీల్లో కబడ్డీ జూనియర్ బాలుర విభాగంలో బషీరాబాద్ ప్రథమ, కోనాసముందర్ ద్వితీయ, శ్రీవిద్యాసాయి తృతీయ, బాలికల విభాగంలో బషీరాబాద్ ప్రథమ, శ్రీవిద్యాసాయి ద్వితీయ, కేజీబీవీ తృతీయ స్థానాల్లో నిలిచాయి. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో బషీరాబాద్ ప్రథమ, చౌట్‌పల్లి ద్వితీయ, కోనాసముందర్ తృతీయ, బాలికల విభాగంలో చౌట్‌పల్లి ప్రథమ, హాసాకొత్తూర్ ద్వితీయ, కోనాసముందర్ తృతీయ స్థానాల్లోనిలిచాయి. ఖోఖో పోటీల్లో జూనియర్ బాలుర విభాగంలో శ్రీవిద్యాసాయి ప్రథమ, కోనాసముందర్ ద్వితీయ, కమ్మర్‌పల్లి తృతీయ, బాలికల విభాగంలో కోనాసముందర్ ప్రథమ, చౌట్‌పల్లి ద్వితీయ, శ్రీవిద్యాసాయి తృతీయ స్థానాల్లో నిలిచాయి. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో చౌట్‌పల్లి ప్రథమ, కమ్మర్‌పల్లి ద్వితీయ, హాసాకొత్తూర్ తృతీయ స్థానాల్లో, బాలికల విభాగంలో చౌట్‌పల్లి ప్రథమ, కోనాసముందర్ ద్వితీయ, హాసాకొత్తూర్ తృతీయస్థానాల్లో నిలిచాయి. వాలీబాల్ జూనియర్ బాలుర విభాగంలో కమ్మర్‌పల్లి ప్రథమ, బషీరాబాద్ ద్వితీయ, విజ్ఞానజ్యోతి తృతీయ, బాలికల విభాగంలో కమ్మర్‌పల్లి ప్రథమ, చౌట్‌పల్లి ద్వితీయ, బషీరాబాద్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో చౌట్‌పల్లి ప్రథమ, శ్రీవిద్యాసాయి ద్వితీయ, బషీరాబాద్ తృతీయ, బాలికల విభాగంలో విజ్ఞానజ్యోతి ప్రథమ, కోనాసముందర్ ద్వితీయ, చౌట్‌పల్లి తృతీయస్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన జట్లకు శనివారం రాత్రి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య బహుమతులను పంపిణీ చేశారు.

బాధ్యతల స్వీకరణ

వెంకటేశ్వర్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్29: ఆర్మూర్ ఏసీపీగా వెంకటేశ్వర్ రెడ్డి శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ సీఐడీ విభాగంలో ఏసీపీగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆర్మూర్ ఏసీపీగా పని చేసిన బస్వారెడ్డి ఇటీవల డీసీపీగా ఉద్యోగోన్నతి పొందారు.

సంక్షిప్తంగా..

- **నిత్యావసర ధరల పెరుగుదలతో ప్రజల ఇబ్బందులు -** ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 29 : నిత్యావసర ధరల పెరుగుదలతో ప్రజల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. నగరంలోని బహుజన కాలనీలో సీపీఎం మహాసభను ఆదివారం నిర్వహించారు. కాలనీవాసులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత, భోజన్న, కాలనీశాఖ సభ్యులు రజియా, పద్మ, అలీబాయి, రిజ్వాన్, పర్వీన్ పాల్గొన్నారు.
- **సన్మానం-** బాల్కొ